**బుద్ధ భగవానుడికి బోధివృక్షం కింద జ్ఞానోదయం కలిగినట్లు నాకు ఒక రోజున మా ఆఫీసు కాంపౌండ్‌లో వున్న చింతచెట్టు కింద జ్ఞానోదయం కలిగింది. ఈ విధంగా కలిగిన జ్ఞానోదయం అస్తమించకుండా చూసుకోవడమే నా బాధ్యత అనుకున్నాను. కాని అది అట్టేకాలం సాగలేదు.**

# అహంకారం

హరికిషన్

సృష్టి కారకుడైన ఈ విధాతకూడా ఏ ధాతనామ సంవత్సరంలోనైనా పుట్టి ఉండాలి. లేకపోతే అన్ని ప్రణాళికల్లోనూ ఆయన కరువు వృద్ధికావడానికే పూనుకున్నట్లు సామాన్య మానవుడికి అర్థమైపోయింది.


అసలు దీనంతటికీ మూలకారణం అహంకారం. ఈ నాలుగక్షరాలనీ సగం సగం చేస్తే అహంకారం. అంటే నేను కారాన్ని. మనిషి డైరెక్ట్‌గా కారం కాదు. అతని మనోభావాలు కారంగా ఉంటయ్యి. మిరపకాయలకారం ఆ పదార్థంలో ఉంటుంది మనిషిలో కారం డబ్బు ఎక్కువైనా వస్తుంది. సంపాదన తగ్గినా వస్తుంది.

మా ఇంట్లో అందరికన్న నేను కారం ఎక్కువ తింటాను. మా ఆవిడ, పిల్లలూ చాలా తక్కువగా తింటారు. వాళ్ళకు కాస్త స్వభావ సిద్ధంగా అహంకారం వున్నది. నాకు స్వభావసిద్ధమైన అహంకారం లేదు కాబట్టి వాళ్ళతో ఈక్వలైజ్ కావడానికి కారం ఎక్కువ తినసాగేను. నాలో వున్న ఈ వీక్ పాయింట్‌ని కనిపెట్టింది మా ఆవిడ.

చేసేది గవర్నమెంటు ఉద్యోగం. ఉండేది విజయవాడ కావడంతో ఆఫీసు ఫైళ్ళ హోరాతో నిక్కాక ఎక్కువై ఎప్పుడూ టెంపరేచర్ 99 కి తగ్గేది కాదు. మనది డెమొక్రెటిక్ కంట్రీ అయినా, సోషలిస్టిక్ పాటర్న్ ఆఫ్ సొసైటీ అని మీటింగుల్లో ఉపన్యాసాలు దంచినా, ఫ్యూడలిస్టిక్ పాటర్న్ ఆఫ్ సొసైటీలోనే బ్రతుకుతున్నాం. ఎప్పుడూ హక్కులకోసమే అరుస్తుంటే బాధ్యతలు మాత్రం మంచులా కరిగిపోతున్నయ్యి.

జీత భత్యాలు చాలినా, చాలక పోయినా మూడేళ్ళ కొకసారి ట్రాన్స్‌ఫర్లు కావటంతో ఈ మార్పిళ్ళవల్ల బ్రతుకు భారంగా తోచేది.

ఇంట్లో ఏ వస్తువయినా కనపడక పోయినా, పిల్లలు అల్లరి చేసినా విసుగూ, చిరాకూ, కోపమూ ఎక్కువై వాళ్ళను కేకలు వెయ్యడంతో, భాష, భావాన్ని మేళవింపు చేసి మా ఆవిడ నా విసుగుకి అహంకారం అని పేరు పెట్టింది. ఎక్కడో చిట్కా వైద్యాల పుస్తకాల్లో అహంకారానికి మూలకారణం కారం ఎక్కువగా వాడడం అనేది చదివిందేమో నేను కారం తగ్గించటానికి పథకం వేసినట్లు ఆ తరవాత నాకు అర్థం అయింది.



నేనూ తెలీనట్లే ఊరుకొన్నాను. ఒక రోజు రాత్రి నేను కోపావతారం చాలించి శాంతావతారంలోకి మారినప్పుడు నెమ్మదిగా అన్నది:

"డియర్ సర్, చిన్న రిక్వెస్ట్. ఉత్త పుణ్యానికి మీకు అందరిమీదా కోపం వస్తున్నది. నా మీదా, పిల్లలమీదా కోపగిస్తున్నారంటే అదొక హోమ్ హాబీ కావచ్చు. నెవర్‌మైండ్. కాని ఇతరులమీద కూడా అహంకారాన్ని ప్రసాదిస్తున్నారు. వాళ్ళు ఫీలవుతున్నారు. మా అమ్మని కేకలేశారు. మీ తమ్ముడినీ కేకలేశారు. మా తమ్ముణ్ణి సరేసరి. మొన్న ఎదిరింటి మీనాక్షమ్మగారి భర్తతోనూ పేచీపడ్డారు."

నేను పడుకున్నవాడిని లేచి కూచున్నాను. "సీతా, నీ ఆర్గ్యుమెంట్సుతో నిన్ను నువ్వు డిఫెండ్ చేసుకున్నావు. ఆల్‌రైట్, తప్పుచేసిన వాళ్ళను శిక్షించడం చేతకాకపోగా వాళ్ళను సమర్థించడం అవివేకం, సోషల్ క్రైం. నా డిఫెన్స్ వాదన నాకూ వున్నది. అసలు నువ్వు చెప్పదల్చుకున్నది ఏమిటి" అన్నాను.

"అహంకారం సర్వపాపాలకూ పుట్టినిల్లు. ఈ అహంకారం కోపానికి మూలకారణం. ఈ అహంకారాన్ని వదులుకుంటే మనిషి సుఖపడతాడు. సుఖదుఃఖాలు సమానంగానే భావిస్తారు. దానివల్ల జీవితం హాయిగా గడిచి పోతుంది. మెంటల్ పీస్




వుంటుంది." అన్నది. ఆవిడ చెప్పింది విన్నాను. అసలువిషయం రాబట్టాలి. ఈ సమస్యకు ముక్తాయింపు యిది కాదు.

"నెక్ట్స్ పాయింట్."

"కమింగ్ సార్. మనింట్లో మీరే అందరికన్నా కారం ఎక్కువ తింటారని అందరికీ తెలుసు. ఒక భార్య, భర్త, నలుగురు పిల్లలకి నెలకి మూడు కిలోల ఎండు మిరపకాయలంటే. ఆ కారానికి మన పని మనిషి కూడా కళ్ళంబడి నీళ్ళొస్తున్నయ్యి. కారం తగ్గిస్తే అహంకారం తగ్గుతుంది. మీకు సరళ స్వభావుడు, శాంతమూర్తి అనే పేరూ వస్తుంది. పరువు పెరుగుతుంది. నీ భర్త ఎంత మంచివాడమ్మా అని అందరూ నాకు 'స్వర్ణకమలం' కాకపోయినా, మెరిట్ సర్టిఫికెట్ అయినా ఇస్తారు. పొలడబ్బాడు కందిపప్పుకు.పావుకిలో మిరపకాయలు వేసి నేను కందిపచ్చడి రుబ్బుతుంటే. పిల్లలు రోటి దగ్గర్నుంచి పారిపోయి రోడ్డుమీద ఆడుకుంటున్నారు. రోలుకడిగి నీళ్ళు పారబోసేంతవరకూ ఇంట్లోకి రారు. మీ కేం మీరు ఫైలు చంకనపెట్టుకుని మీ దార్న మీరు ఆఫీసుకి పోతారు. నా సిన్సియర్ రిక్వెస్ట్ కైండ్లీ కన్సిడర్ సర్" అన్నది. కాస్త బెట్టుచేస్తే సొట్టబుగ్గలు ఎట్లా అవుతయ్యా అని ఆలోచించి "ఒక చిన్న ఎమెండ్ మెంట్‌తో నీ కోరిక తీరుస్తాను. కారాన్ని జోన్‌లైజ్ చేద్దాం.కారం,ఉప్పు అనేది కిచెన్ కేటగిరీ కింద వస్తుంది. నేను తినే కారం నెమ్మదిగా తగ్గిస్తాను. నా కారం జోన్ 1 కింద వస్తుంది. నువ్వు కాస్త మీడియంగా తిను. జోన్ 2. పిల్లలు తగ్గించి తింటారు. వాళ్ళకు జోన్ 3. అంటే మూడు రకాల పదార్థాలు. క్రమేపీ జోన్ 1 నుంచి నేను జోన్ 2లోకి మార్తాను" అన్నాను.

సీత పొట్ట చెక్కలయ్యేట్లు నవ్వింది. ఆ నవ్వుని ఆ రాత్రి నేనూ పంచుకున్నాను.

గడియారం అయిదు కొట్టింది. నన్ను నిద్ర లేపి "నేను జోన్ 1 లోకి వెళుతున్నాను" అన్నది.

"అంటే కారంలోకా" అన్నాను.

"కాదు, ఇంటిని కూడా జోన్లుగా విభజించాను. జోన్ 1 వంటిల్లు, జోన్ 2 మన పడగ్గది, జోన్ 3 పిల్లలగది, జోన్ 4 మీ ఆఫీసుగది, కామన్ జోన్ అంటే వరండా" అన్నది.

నాకు తల తిరిగిపోయింది, బుర్రవేడెక్కింది.ముఖ్యమంత్రి మునుపటిసంబంధం కూతురులా మాట్లాడుతున్నదే అని ఆశ్చర్యపోయాను.

నేనేదో ఎగతాళికి కారం విషయంలో జోన్లు చేద్దామని జోక్‌గా అంటే సీత ఇంటినే జోన్లుగా భాగించేసింది, రాజకీయ అస్థిరత మాదిరే ఇంట్లో కూడా అస్థిరత ఏర్పడుతుందని భయపడి, అయినా చూద్దాం అనుకుని నాకు నేనే సమాధానం చెప్పుకున్నాను.

వారం గడిచింది. కారం యథాప్రకారమే వేస్తానన్నది సీత. మార్పు కనిపించనేలేదు. స్ట్రాంగ్, మీడియమ్, లైట్‌గా కాఫీ తాగినట్లు నా జోనలైజేషన్ థీరీ అమలుపరిచిందేమో అనుకున్నాను. ఆ రోజున కాస్త ఆలోచనలకు పగ్గోలాక్స్ వేద్దామని సీతతో అన్నాను, "డాక్టరు దగ్గరకు వెళ్ళాను. కారం అసలు మానేయమన్నాడు. నేను చప్పిటి కూరతే తినాలిట."

"రోగం పేరు" — కూర తరుగుతూ అన్నది.

"ఎండు మిర్చి త్రిచోసిస్."

"చాలా ప్రమాదమని చెప్పేదా డాక్టరు. పథ్యం ఏమిటో?"

గంభీర ముద్ర దాల్చింది సీత. చిన్నప్పుడు డాన్సు చేసింది ఇప్పుడు డాన్సు చేయకపోయినా ముఖకవళికల్లో అభినయం పోలేదు.

"ఉప్పూ, కారం అసలు మానెయ్యాలి, పప్పులో ఒక్క ఉప్పురాయి చాలు. నాన్ వెజిటేరియన్ నెలపై రోజులు మానెయ్యాలి" అన్నాను.

"ఓ. కే. మరి మానసిక, శారీరక పథ్యం సంగతి చెప్పలేదా"-అభయ ముద్ర దాల్చి అడిగింది. నా మనస్సు రెండడుగులు వెనక్కి వేసింది. ఒక్కొక్కప్పుడు మన్నన ఎక్కువైతే గౌరవం ముందుకు వచ్చి మాటల్ని వెనక్కి నెట్టేస్తుంది.

"హోమ్‌గార్డ్‌వి నువ్వు చూసుకుంటావని ఆ హోమ్‌సైన్స్‌ని గురించి డాక్టర్ను అడగలేదు."

"వెరీ నైస్. జోన్ 4లోకి వెళ్ళి మీ ఆఫీసు పని చూసుకోండి. అవసరమైతే ఫోన్ చేస్తాను" అన్నది.

నా గుండెల్లో గులాబిముళ్ళు తగిలాయి. వంట గదికీ, ఆఫీసు గదికీ ఫోనేమిటా అని ఇందులో ఏదో కిటుకు ఉన్నదని ఊహించాను.

ఆ రోజు నుంచే కారం స్పర్శ లేదు. ఉదయానే చేసే టిఫిన్‌కు వేసే పచ్చడిలో

కూడా కారం లేదు. ఇడ్లీ కారప్పొడిలో ధనియాలూ, పప్పుదినుసులూ మినహా మరేం లేదు. అయినా సరేనని నేనూ జిహ్వ చంపుకున్నాను. కాని ఈ పట్టుదల వదల కూడనే అనుకున్నాను.

ఆలోచిస్తే నాలో నాకే నవ్వొచ్చింది. తనుచేసే వంటపదార్థాల్లో కారం వెయ్యటం లేదుగాని. హోటళ్ళమీద సీతకు కంట్రోల్ లేదుగా. హోటల్లో నాకు కావాల్సినవి తిన సాగేను.

ఆ రోజున సీత పుట్టిన రోజు. సీత బర్త్‌డే ఫంక్షన్‌కి ఎప్పుడూ సరదాగానే ఖర్చుపెట్టేవాడిని. డేటాఫ్ బర్త్ 1-12-1953. కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం అవతరించిన రోజుల్లో 'ఏ' క్యాంప్ టెంట్‌లో వాళ్ళ నాన్నగారు వుంటున్న రోజుల్లో సీత పుట్టింది. అంచేత ఆవిడ ఆంధ్రరాష్ట్రం బ్రాండ్. నేను అవిభక్త మద్రాస్ రాష్ట్రంలో 16-6-1948లో పుట్టానుగనుక కాంపోజిట్ మద్రాస్. మా పెళ్ళి 2-12-71లో హైదరాబాద్ నగరంలో జరిగింది కనక విశాలాంధ్ర భావాలు ఏర్పడ్డాయి.


'ఏ దేశ మేగినా, ఎందుకాలిడినా, పొగడరా నీ తల్లి భూమి భారతిని.' అన్నట్లు ఉద్యోగరీత్యా ఏ ఊరు తిరిగినా, ఏ ఇంటిలో ఉన్నా. గ్రైండరూ, గ్యాస్ సిలెండరూ ఉంటే చాలు, సీత ఆ వాతావరణానికి ఇట్టే ఎడ్జెస్ట్ అయిపోయేది.


ఒకరోజున ఆఫీసునుంచీ వచ్చేసరికి సీత చక్కగా ముస్తాబై కూర్చున్నది. పిల్లలు చేగోడీలూ, చక్కిరాలూ, తింటూ కూర్చున్నారు. తనూ చేగోడీలు తింటూ పేపరు చదువుతున్నది. నన్ను చూడగానే లేచి వంటింట్లోకి వెళ్ళి ఒక ప్లేట్‌లో చేగోడీలూ, కారప్పూస తెచ్చి టేబుల్‌మీద పెట్టింది. నేను బట్టలు మార్చుకుని, కాళ్ళూచేతులూ కడుక్కుని వచ్చి ఒక చేగోడీ నోట్లో వేసుకుని నమిలాను. ఉప్పు, కారంలేదు. ఐ. సీ. అనుకున్నాను. పిల్లలుతినేవి వాళ్ళ ప్లేట్లల్లోవి తీసుకుని రెండు తిన్నాను. కాస్త రుచిగా ఉన్నయి. చిటికెడు కారం, చిటికెడు ఉప్పు పడ్డది. సీత తినే ప్లేట్లోవి రెండు తిన్నాను. చక్కగా, రుచిగా, కాస్త కారంగా, ఉండవలసిన తీరున ఉన్నయి. అర్థమైంది.

"మూడు రకాలుగా చేసేవన్నమాట. కారణం?"

"సిక్స్ పాయింట్ ఫార్ములా, రద్దు కాని జోనలైజేషన్ పద్ధతి. జోన్ 1, జోన్ 2, జోన్ 3గా కారాన్ని విభజించారుగా—అట్లాగే చేశాను."

నాకు పళ్ళు మండిపోయింది. అహం కారం ఆల్సేషియన్ డాగ్‌లా నాలో అరవ




సాగింది. కోపంతో ముఖం జేవురించింది.

"నీ జోనల్ పద్ధతి నాశనం కాను. చెంపలు పేలిపోతయ్ జాగ్రత్త. అహం కారం తగ్గాలనే నెపంతో కారం విషయంలో కూడా జోనల్ పద్ధతిని ప్రవేశపెట్టి నన్ను ఇన్‌సల్ట్ చేస్తావా. నిన్ను పిల్లల్ని ఫారెన్ సర్వీస్‌కు డెప్యుటేషన్ మీద పంపిస్తాను జాగ్రత్త" అన్నాను.

సీత నిరుత్తరురాలైంది. ఓ గంట గడిచాక చాలా చాలా ఆలోచించి నేను తొందర పడ్డానా అని అనుకున్నాను. ఆరోజల్లా సీత నాతో మాట్లాడనే లేదు. చెరో మంచం పట్టెనీ ఆశ్రయించి నిద్రపోయాం.

మర్నాడు ఉదయం ఎనిమిదింటికి యథా ప్రకారం టిఫిన్ చేద్దామని వంటింట్లోకి వెళ్ళేను.

మూడు పెసరట్లు, పంచదార. చట్నీలేదు. మూతి బిగదీసుకుని గ్యాస్ స్టవ్ ఆర్పి కూర్చున్నది.

"డిస్కస్ ప్లీజ్" అన్నాను ఆఫీసర్ స్టయిల్లో.

"రెడీ ఫర్ డెప్యుటేషన్. నో డిస్కషన్" అన్నది.

"డెప్యుటేషన్ అంటే అర్థమైందా."

"ఎస్ ప్లీజ్, పుట్టిల్లు" అన్నది.

గతుక్కు మన్నాను. రెండు పెసరట్లు పంచదారతో తిన్నాను. మూడో పెసరట్టు వదిలేశాను.

"డెప్యుటేషన్ యెప్పట్నుంచి సర్" అన్నది.

"ఎబెయన్స్‌లో పెట్టాను, మళ్ళీచెప్తాను"

"థ్యాంక్స్."

ఇదంతా ఎవరి అహంకారమో నాకూ అర్థం కాలేదు.

"సీతా, నాలో వున్న అహంకారాన్ని పోగొట్టడానికి నీలో వున్న అహంకారాన్ని అనేకరకాలుగా ప్రసారంచేస్తూ, ప్రయోగం చేస్తున్నావు. బావుంది. కాని మనిషిలో ఏ కారమూ లేకపోతే, నిర్వికార నిరంజనుడుగా అనామక అగ్రగణ్యుడుగా మారిపోతాడు. నీ భర్త సదరు రామారావు అనబడే నేను అసమర్థుణ్ణి అయిపోతే నీకు మాత్రం నామోషీ కాదా" అన్నాను.

సీత తల అడ్డంగా తిప్పింది. ఆ మనస్సులో ఏదో వున్నది. ఆ వుద్దేశ్యం బయట పడాలి అంటే నాకే అంతుపట్టదు.


రోజులు గడుస్తున్నయ్యి. చప్పిటి కూడుతో చప్పిదవడలు ఏళ్ళపడతయ్యేమోనని భయపడ్డాను. మగవాడిననే ధీమావున్నా, భార్యా విధేయత కూడా కాస్త సాంఘికంగా కావాలి గనక తగినంత విధేయత కనబరుస్తూనే ఉన్నాను. సీత భావాల్లో కొన్ని కొన్ని విషయాల్లో నాజూకుతనం ఉన్నది. ఆ ఫలితాలు తొందరగా కనిపించవు. ఆ తరవాత ఆ ఫలితాలు తెల్సేసరికి సంవత్సరం కూడా దాటిపోవచ్చు.

ఒకరోజు రాత్రి ఈ విషయాలే ఆలోచిస్తూ పడుకున్నాను. సీత కూడా ఇంటిపన్లు పూర్తిచేసుకుని వచ్చి గుమ్మం దగ్గర నిల్చున్నది.

"పాలకడలిపై శేష తల్పమున శ్రీమహావిష్ణువు శయనించినట్లు పడుకున్నారు. నా లక్ష్మీదేవి వేషంలో కాళ్ళు పిసికే సీను, తీసేశాను డైరెక్ట్‌గా అడుగుతున్నాను. మీరు కోపతాపాలను తగ్గించుకుంటారా లేదా" అన్నది గది గుమ్మం పుచ్చుకుని.

"అసలు నాకు కోపతాపాలు ఉన్నయ్యి అనటానికి ఆధారం ఏది, నిదర్శనం చూపించగలవా" గట్టిగానే అడిగాను.

"ఓ ఎస్. మన పెద్దవాడు రవి అర్ధరూపాయి పెన్సిల్ పారేశాడని వాడి లెంపలు వాయించారు. వాడి బుగ్గలు కమిలిపోయినయి. మొన్న ఆటోరిక్షా అతనితో ఘర్షణ. చాకలి బనీను పారేస్తే దుర్యోధనుడి మయసభ సీనంతటి యాక్షను, లెక్చరు. ఇదేమయినా బాగుందా? అందరూ నన్ను ఆడిపోసుకుంటున్నారు. అంత కోపిష్టితో ఎట్లా కాపరం చేస్తున్నావమ్మా అని మీనాక్షమ్మ నిలదీసి అడిగింది. మీలో మార్పు వస్తే, తల నీలాలు యిస్తానని మొక్కుకుందామనుకుంటున్నాను. తెలిసీ తెలియని ఉత్సాహంతో, ఏదో అనుభవించాలనే తపనతో సర్దుకుపోయాను. ఇక నేను బయటపడక తప్పలేదు. మీకు గర్వం లేదు. చాలా అదృష్టం. కోపం, అహంకారం, విసుగూ వున్నయ్యి. మీలో మార్పు రావాలి. ఇక నుంచీ సూపర్ హస్బెండ్‌లా ప్రవర్తిస్తే నేను భరించలేను- దట్సాల్" అన్నది.



నామీద సీత ఈ ధ్వజం ఎత్తటం లోగడ చాలాసార్లు జరిగినా, ఆ వాతావరణం నాలుగు రోజుల్లోనే సర్దు మణిగేది. ఈ సారికి కూడా సమసిపోతుందేమో అనుకున్నాను. కాని ఆ నమ్మకం నాకూ పోయింది.

ఒకరోజున నేను ఆఫీసు నుంచి వచ్చేసరికి ఒక పుస్తకం చదువుతున్నది సీత. నన్ను చూడగానే చిరునవ్వుతో ఎదురొచ్చి ఆ పుస్తకం చేతులో వుంచింది. నన్నుచూసి ఆ పుస్తకం దాచేస్తే నా సుపీరియారిటీ కాంప్లెక్స్‌కి సార్థకత ఉండేది. ఈ సంఘటనకు నేను కాస్త ఫీలయాను. ఆ పుస్తకం చూశాను. "భార్యను లొంగతీసుకోవటం ఎట్లా ?" అనే చిట్కా- సూత్రాల పుస్తకం. ఈ పుస్తకాలు మగవాడు చదవాలిగాని భార్య చదవటం ఏమిటా అనిపించింది.

బట్టలు మార్చుకుని, సోఫాలో కూర్చున్నాను. సీత టిఫిన్ తెచ్చింది. అది మిక్చర్. జీడిపప్పులు తిని మిక్చర్ వదిలేశాను. ఉప్పు, కారం లేదు. తను కూడా పక్కనే కూర్చున్నది.

సర్వసాధారణంగా ఒక వ్యక్తి మరో వ్యక్తిని మోసంచేసే ఉద్దేశ్యంతో ఉన్నాడంటే ఆ ఫీలింగ్స్ ముఖ కవళికల్లో కనిపిస్తయ్యి. భార్యాభర్తలు ఒకరి నొకరు మోసం చేసుకోవటం చాలా అరుదు. వెయ్యికి ఒకడు అట్లా మోసం చేసుకున్నా అది సెక్స్ సంబంధమే అయి ఉంటుంది. బైటపడకుండా చాలా జాగ్రత్తగానే ఉంటారు. మా దంపతులమధ్య చెలరేగిన ఈ స్రవంతి మోసం కాదు, త్యాగం కాదు. ఒక సూక్ష్మాతిసూక్ష్మమైన మాట నెగ్గించుకోవటం. ఆ చిన్న పాయింట్ ఎవరు నెగ్గుతారా అనేదే మా ఇద్దరి అంతరంగ అవస్థ.

"ఈ పది పదిహేను రోజుల్నుంచీ మీ కళ్ళు స్వచ్ఛంగా తేటగా ఉన్నయ్యి. చూపుల్లో లాలన ఉన్నదికాని లాస్యంలేదు" అన్నది. ఆ భాష నాకు అర్థంకాలేదు.

"అంటే ?"

"చేతల్లో సంతృప్తి వున్నా మాటల్లో కసుకుదనం కాస్త తగ్గింది. సర్దుకుపోయే స్వభావానికి వయస్సొచ్చింది" అన్నది.


చేతికి వెన్నపూస రాచుకుని చాచి లెంప వాయించినట్లుగా ఫీలయ్యాను. భావం అర్థమైంది!

"అంటే నీకు లొంగిపోయాననేగా నువ్వనేది."

తను తెచ్చుకున్న ప్లేట్లో మిక్చర్ పలుకులు రెండు తీసుకుని తిన్నాను. ఉప్పు కారం సమపాళ్లల్లో వుండి రుచిగా వున్నయ్యి. నాకు ఇచ్చింది చప్పిడి మిక్చర్! సీత చెయ్యి గట్టిగా పుచ్చుకుని ఆ మిక్చర్ అంతా నేనే తినేశాను.

"డియర్ సార్, నమ్మకం ముదిరితే సెంటిమెంట్ అవుతుంది. సెంటిమెంట్ ముదిరితే సరెండర్ అవుతారు. అంటే నమ్మకం ముదిరితే మూఢనమ్మకం. అదే విధంగా మీలోని అహంకారం ముదిరి క్రౌర్యంగా మారింది. భార్య చేతులు గట్టిగా నొక్కి-పట్టి ఆవిడ ఫలహారం మీరే తినేశారంటే అహంకారం ముదిరిందన్న యథార్థాన్ని వప్పుకోండి" అన్నది బింకంగా చూస్తూ.

"నాకు చప్పిడి కూడు, చప్పిడి పదార్థాలూ పెట్టి నువ్వు షడ్రుచులతో నా ఎదుటనే నీకు కావలసినవి చేసుకుని తినటం అహంకారాన్ని మించిన అందమైన పొగరు




బోతుతనం. మనిద్దరిమధ్యా వుండవలసిన ప్రేమానురాగాలని నువ్వు కావాలని ఆపరేషన్ చేసి తీసి పారేస్తున్నావ్. నేను అహంకారిగానే జీవిస్తాను. నేను మారను" అన్నాను గట్టిగా కోపంతో.

సీత ముఖంలో పట్టుదల కనిపించింది. తను మరో యెత్తుగడ వేస్తుందని నాకూ తెలుసు. చూద్దాం అనుకున్నాను.

రెండురోజులు గడిచాయి. "రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో జోనల్ పద్ధతి మారేదిలేదు" అనే హెడ్డింగుతో పేపర్లో వార్తలు వచ్చాయి. ప్రభుత్వ ఉద్యోగాల్లో రిక్రూట్ మెంట్ కు. ప్రమోషన్లలో. ట్రాన్స్ఫర్లల్లో ఈ జోనల్ పద్ధతి 1975 నుంచి అమలుజరుగుతూనే వున్నది. ఆ విషయాన్ని గురించే ప్రభుత్వం తమ నిర్ణయాన్ని మరోసారి ప్రకటించింది. ఆవార్తలిని చదివింది సీత. ఆ వివరాలన్నీ లోగడ సీతకూ తెలుసు. అవన్నీ చదివి ఆకళింపు చేసుకున్నది. నా అహంకారానికీ. ఈ జోనల్ పద్ధతికీ ముడిపెడుతుందేమోననే ఆలోచన నాకూ వచ్చింది. ఎవరి ఆలోచనలు వాళ్ళం మా మనస్సుల్లోనే పదిలపరుచుకున్నాం. బాగా ఆలోచిస్తే మగవాడి అహంకారంకన్న ఆడదాని అభిమానమే జీవితం మీద దెబ్బతీస్తుంది.

ఆ రోజు రాత్రి పిల్లలు పడుకునే గదిలో తనూ ఒక మంచం. పక్క వేసుకుని పడుకున్నది. నేను మాట్లాడలేదు. మర్నాడు రాత్రీ అంతే. ఈ విపరీతానికి కారణం ఏమిటని అడిగేను.

"డియర్ సర్. నేను కర్నూలులో పుట్టాను. నాది జోన్4. మీరు కృష్ణాజిల్లాలో పుట్టేరు. జోన్ 2. మన పెళ్ళి హైద్రాబాద్‌లో జరిగింది. జోన్ 7. ఉద్యోగరీత్యా జోన్ 2లో జోన్ 3లో ప్రాజెక్ట్ సర్వీస్ అంటే కామన్ జోన్‌లోనూ ఉన్నాం. అంటే జీవితంలో ఉద్యోగం ఒక భాగం. అట్లాగే ఉద్యోగం కూడా జీవితంలో ఒక భాగం. మన ఇంటినీ జీవిత విధానంలోనూ జోనల్ పద్ధతిని ప్రవేశపెడదామనిపించింది" అన్నది. సబ్జెక్ట్ చాలా ఉత్సాహంగానే ఉన్నది. మనస్సులో 'అహంకారమా నీకు జోహార్." అనుకున్నాను.

"వెరీ నైస్. ఆ పథకం ఏమిటో విమర్శగా వివరించు."

చెంగు ముందుకు తిప్పుకొని ఎడంవైపు దోపుకుంది. కట్టుకున్న జరీ అంచు చీరె నావైపు స్టయిలిష్‌గా చూస్తున్నట్లనిపించింది. చేతులు కట్టుకుని నిల్చున్నాను.

"వంట యిల్లు. కామన్‌జోన్. అంటే ప్రాజెక్ట్ సర్వీస్. మీ పడగ్గది జోన్ 1. నేనూ పిల్లలూ పడుకునేగది జోన్ 2. మీ ఆఫీసు గది జోన్ 3. వరండా సోషల్ సర్వీసెస్ సెక్షన్-అదే కామన్‌జోన్. అంటే కామన్‌జోన్ అయిన పంటఇల్లు.వరండాల్లో మన కుటుంబసభ్యులు అందరూ తిరగొచ్చు. జోన్ 1,2,3 మాత్రం పరిమితం. పర్మిషన్ లేనిదే ఒకరి జోన్‌లోకి మరొకరు రావడానికి వీల్లేదు" అన్నది సీత.

"చాలా బావుంది ఓ. కె. అన్నాను.

ఈ జోనల్ పద్ధతి వారం రోజులు అమలు పరిచాం. పిల్లలకు ఏమీ తెలీక అమ్మ. నాన్నలో ఏదో మార్పు వచ్చిందని గ్రహించారు.

రెండో అమ్మాయి నీరజ. తల్లిని అడిగింది.

"అమ్మా. నువ్వు మా గదిలో పడుకుంటున్నావేం?"

"నాకు భయం. నువ్వు తోడుగా ఉంటావని నీ దగ్గర పడుకుంటున్నాను. వద్దంటావా?"

"నాన్న అరుస్తారు. కేకలేస్తారు. బయమే. అయినా నేనున్నాగా బయం లేదులే. నా దగ్గరే పడుకో" అన్నది నీరజ.

ఒకరోజున కామన్ జోన్ వంటఇంట్లో భోజనంచేస్తూ సీతతో అన్నాను.

"నేను జోన్ 2 లోకి రావచ్చా. నువ్వు జోన్ 1 లోకి వస్తావా".

"లేదు సార్. జోనల్ పద్ధతి అమలు జరగాల్సిందే. నేను ట్రాన్స్ఫర్‌కి అప్లై చెయ్యను. మీ ట్రాన్స్ఫర్ అప్లికేషన్ పంపండి. చూద్దాం" అన్నది.

నేను ఇక ఈ విషయం మాట్లాడలేదు. సీత పట్టువల నాకు తెలుసు. కాని అవసరాల్ని పరిస్థితికి మించి వాయిదా వేసుకోవటం వయస్సుకు మించిన పని. అంచేత ఈ ప్రాబ్లమ్‌కి పరిష్కారం కనబడలేదు.

ఆ మర్నాడు ఉదయమే రేడియోలో 'భక్తి రంజని'లో భజగోవిందం శ్లోకాలు వినిపించారు. నా బుర్ర పదునెక్కింది. ఆరోజు సాయంత్రమే ఆఫీసునుంచి వస్తూ భజగోవిందం శ్లోకాల పుస్తకం తెచ్చాను. ఆ రాత్రి భోజనం చేసి జోన్ 1 అయిన నా పడగ్గదిలో కూర్చుని అయిదారుసార్లు చదివేను.

అసలు మా ఈ జోనల్ పద్ధతికి మూలకారణం నాలో ఉన్న అహంకారం అనేది సీత చెప్పిందే కద. ఈ అహంకారానికి మూలకారణం సంసార వ్యామోహం. ఆధ్యాత్మిక విషయాలమీద మనస్సు మళ్ళితే ఈ స్త్రీ వ్యామోహం ఉండదు. కాస్త తగ్గుతుంది అనే ఆలోచన కలిగింది. ఈ శ్లోకాల్లో అమూల్యమైన శ్లోకం ఇది:

నారీ స్తనభర నాభీదేశం
దృష్ట్వామాగా మోహావేశం.
ఏతన్మాంస రసాది వికారమ్
మానస చిన్తయ వారం వారమ్.
భజగోవిందం. భజగోవిందం
గోవిందం భజ మూఢమతే....

శంకరాచార్యులవారు ఎంతో స్టడీచేసి ఈ నిశ్చయానికి వచ్చి యిటువంటి శ్లోకాలు రాశారనుకున్నాను. చదివిన కొద్దీ నాకు ఆధ్యాత్మిక చింతన యెక్కువైంది. శ్లోకం కంఠతా వచ్చేసింది.

జోన్ 1కి. జోన్ 2కి మధ్య ఉన్న గుమ్మందగ్గర నిల్చుని రాత్రి పదకొండు దాటాక చూసేను. సీత. పిల్లలూ ఆదమర్చి నిద్రపోతున్నారు.

నారీ స్తన భర నా భీ దేశమ్....

దృష్ట్వామాగా మోహావేశమ్........ ఛా. మోహం సర్వబాధలకూ మూలకారణం. నీకీ భార్య ఎక్కడిది? మీ ఇద్దరికీ వివాహం కాకమునుపు మీ ఇద్దరూ ఎవరు? ప్రేమానుబంధం లేదుకదా? పెళ్ళి చేసుకుని ప్రేమించుకున్నారు. ఫలితం నలు

గురు పిల్లలు. బాగా ఆలోచిస్తే ఈ ఒక్క శ్లోకమే రూపాంతరంచెంది ఈనాటి కుటుంబనియంత్రణ అయిందేమో!

మళ్ళీ వచ్చి నా మంచంమీద పడుకున్నాను. నాకు నిద్రపట్టనేలేదు. శంకరాచార్యులవారి శ్లోకాలు నా చెవిలో రొదపెడుతూనే ఉన్నయ్యి.

తెల్లవారింది. యథాప్రకారం కాలకృత్యాలూ, చప్పిడి కూరలూ, పదార్థాలూ. అహంకారం నాకున్నదో సీతకు ఎక్కువ అయిందో నాకు అర్థం కావటం లేదు.

మర్నాడు రాత్రి కూడా అంతే. ఒక రాత్రివేళ మా పెద్దవాడు రవి వచ్చి నా పక్కలో పడుకున్నాడు. వాడికి కొంచెం జ్వరం వచ్చింది. మూలుగుతున్నాడు. కాళ్లూ చేతులూ పీక్కుపోతున్నయ్యని ఏడుపు మొదలుపెట్టాడు.

నాకు ఆ పరిస్థితి చూస్తుంటే వళ్ళుమండిపోయింది. నా గది గుమ్మం దగ్గర నిల్చుని చూశాను. సీత చక్కగా నిద్రపోతున్నది.

"సీతా, మొద్దునిద్ర, రవికి జ్వరం వచ్చింది" అని గట్టిగా అన్నాను. సీత లేచి కూర్చున్నది.

"అంత గట్టిగా అరవక్కర్లేదు. వాడికి జ్వరం వచ్చిన సంగతి నాకూ తెలుసు. మీ జోన్‌లో వాడిక్కాస్త రిలీఫ్‌గా వుంటుందని నేనే పంపేను" అన్నది.

"నా బొందలాగే వున్నది నీ జోనల్ పద్ధతి! నువ్వు ఈ గదిలోకి తగలడు. వాడికి కాళ్ళు పిసకాలట, నా వల్లకాదు. ఆ జ్వరం వాడు ఈ గదిలో ఎందుకూ, నీ గదిలోనే పడుకోబెట్టు" అన్నాను.

"లాభం లేదు సార్, నారుపోసినవాళ్ళే నీరుపోసి ఆదరించాలి. నన్ను ఆ గదిలోకి వచ్చి తగలడమన్నారు. కిరసనాయిలుపోసి మీరిస్తారా, నేను తెచ్చుకోవాలా" అన్నది బింకంగా చూస్తూ.

"యూడెవిల్, ఇడియట్, రాస్కెల్, మారవలసింది నువ్వు, నేనుకాదు, నన్ను కాల్చుకు తింటున్నావ్" అని యువతలికి వచ్చేశాను. మా అహంకార ప్రకరణ చిలికి చిలికి సైక్లోన్ అయింది. సీత మారేట్లులేదు. దీనిరోగం మరోలా కుదర్చాలనుకున్నాను.

నాలుగు రోజులు క్యాంపు వేసుకుని హైదరాబాద్ వెళ్ళేను. వెళ్ళేటప్పుడు ఎన్ని రోజుల్లో వస్తారని అడిగింది.

"నీ అహంకారం పోయినప్పుడు, నాతో సవ్యంగా కాపరం చెయ్యాలనే జ్ఞానం నీకు కలిగినప్పుడు. నా అవసరం నీకు కలిగినప్పుడు" అన్నాను. నా సీరియస్ మాటలని సీత చాలా లైట్‌గా తీసుకుని నవ్వేసింది.

"మైడియర్ సర్, చప్పిడి తిండికే ఇంత చప్పిడి చేస్తున్నారు. ఇక కారం యథాప్రకారం తింటే నాకు రోజూ కన్నీరే మిగుల్తుందేమో. మీకు ఎప్పుడు రావాలని ఉంటే అప్పుడే రండి. ఆఫీసు డ్యూటీ తరవాతనే భార్యాపిల్లలు" అన్నది.

నేను మాట్లాడకుండా వెళ్ళేను. అక్కడికి వెళ్ళానన్న మాటేగాని, నా ధ్యాసంతా ఇంటిమీదనే ఉన్నది. రవికి జ్వరం ఎట్లా ఉన్నదో? సీత మనస్సు మాటలతో, రెచ్చిస్తూ బాధపెడుతున్నానా? అసలు నాలో ఉన్నది అహంకారమా? కోపమా? ఉప్పూ, కారం తగ్గిస్తే అహంకారం తగ్గుతుందా? ఎవరు తగ్గి ఉండాలి? భార్యా, భర్తా? ఆలోచనలతో సతమతమైపోయాను.

బట్టీపట్టిన మరో శ్లోకం చదువుకున్నాను.

"కాతే కాన్తా కస్తే పుత్రి
సంసారో యమితే విచిత్రః।
.................."

వెర్రివాడా స్త్రీ వ్యామోహం పోవాలి. స్త్రీ సహజ సౌందర్యపు వంపులను చూసి భ్రమించి, ఆ స్మితామృతపు తరంగాలలో మునిగి తేలుతూ, మదోన్మత్తుడవై క్రీడిస్తున్నప్పుడు నీలో ఆత్మవిమర్శ, ఆత్మజ్ఞానం ఎట్లా కలుగుతుంది? స్త్రీని జయించాలి అంటే స్త్రీమీద నీకుగల వ్యామోహాన్ని జయించాలి. ముందు మోహాన్నీ, వ్యామోహాన్నీ తగ్గించుకో. భ్రమ కనుక పోతే, స్త్రీ నువ్వు చెప్పినట్లే వింటుంది. నీలో స్త్రీ మీద వున్న వ్యామోహాన్ని స్త్రీ అతిచక్కగా ఉపయోగించుకొని, తన భావాలకూ, ఉద్దేశ్యాలకూ అనుగుణంగా నీ మనస్తత్వాన్ని మార్చేస్తుంది. జాగ్రత్త. నా మనస్సులో ఈ మాటలు ప్రతిధ్వనించినయ్యి. కంట్రోలింగ్ కెపాసిటీని నాకు ప్రసాదించమని ఆ దేవదేవుని ప్రార్థించాను.

మూడు రోజులు గడిచినయ్యి. ఆఫీసు పని పూర్తయింది. ఇక వుండబుద్ధిపుట్టలేదు. వచ్చేశాను. ఇల్లు దగ్గర పడుతున్న కొద్దీ ఆలోచన. తహ తహ ఎక్కువైంది. ఈ అహంకారం తగ్గింపు పేరుతో సీత నన్ను పల్టీలు కొట్టిస్తున్నది. ఎవరు ఎవరికి లోకువ కాదు. ఎవరు ఎవరికీ తగ్గి వుండక్కర్లేదు. ఇవన్నీ మన ఊహలూ, చేతలూ మనని ప్రలోభపెట్టి ఆడిస్తున్న అంతర్నాటకం అనుకున్నాను.

వీధిగేటు దాటి లోపలికి వచ్చేసరికి జోనల్ పద్ధతి గుర్తొచ్చింది. కామన్ జోన్ అయిన వరండాలో పిల్లలు ఆడుకుంటున్నారు. "అమ్మా నాన్నొచ్చారు" అని పిల్లలు సంతోషంగా అరుస్తూ ఇంట్లోకి వెళ్ళారు. జోన్ 1 వంటింట్లో వున్న సీత వచ్చింది. పలకరింపు ప్రశ్నలూ, పిల్లల ఆరోగ్యం, రవికి జ్వరం తగ్గడం, ఇత్యాది కబుర్లు. నేనూ జోన్ 1 లోనే కూర్చుని మాట్లాడాను. భోజనం చేసి ఆఫీసుకు వెళ్ళేను.

ఆ రాత్రి భోజనాలు అయినాయి. ఎవరి జోన్‌లో వాళ్ళు పడుకున్నాం. సీత వస్తుందేమో అనుకున్నాను. రాలేదు. సీతకు అహంకారం ఎక్కువైంది అని రూఢి చేసుకున్నాను. మనస్సు వువ్విళ్ళూరింది. నేనే జోన్ 2 లోకి వెళ్ళి సీతను పిలిస్తే నా అహంకారం తగ్గిందని సీత అనుకుంటుంది. కారం కూడా యధాప్రకారం చెప్పి వేయించుకోవచ్చు. నెమ్మదిగా వెళ్ళి సీత మంచం దగ్గర నిల్చున్నాను.

"మళ్ళీ అంతేనా, వెర్రివాడా, నీ ఆధ్యాత్మిక చింతన యేమైంది. మళ్ళీ సంసార బంధంలో పడుతున్నావు. పద ఆ శ్లోకం గుర్తుతెచ్చుకో, నారీ స్తన భర నాభీదేశం, దృష్ట్వా మాగా మోహావేశం...." వెనక్కు తిరిగాను. గభాల్న నా చెయ్యి పుచ్చుకున్నది సీత. లేచి కూర్చున్నది.

"డియర్ సర్, అహంకార, మమకారాలు మనిషికి వుండక మానుకి వుంటయ్యా. ఉండక తప్పదు. కాని అవి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌గా కాకుండా, సాదా, సీదాగా పాలిష్డ్‌గా ఉంటేనే రాణిస్తయ్యి. అహంకారం పదోనంబరు అంత ముతగ్గా ఉంటే భరించటం కష్టం. నాటకం రక్తి కట్టాలంటే చాలావరకు నటన, డైలాగ్ డెలివరీల మీద ఆధారపడి ఉంటుంది. జీవితంకూడా ఒక నటన. జీవితం అంతం అయినప్పుడే తెరపడేది. అంతవరకూ భార్యాభర్తలమధ్య సంసారం అనే స్టేజీ మీద, నవరస నాట్య భంగిమలు తప్పవు. ఈ అహంకారం అనేది మానసిక దిగంబరత్వాన్ని సూచించేది. శరీరంమీద ఖరీదుగల బట్టలున్నా, అహంకారాన్ని కూడా అమిత సెక్సీగా చూపిస్తుంటే జుగుప్స కలుగుతుంది. పొదుపుగా వాడవలసినచోట, సరయిన శృతిలో వాడుతుంటే, అహంకారానికి కూడా ఎంతో విలువ, మర్యాద వుంటుంది" అన్నది అనునయంగా. నేను మాట్లాడలేదు. వెనక్కు తిరిగాను గదిలోకి వెళదామని.

"ప్లీజ్, జోనల్ సిస్టం రద్దు చేద్దాం. పదండి మీ జోన్‌లోకి నేనే వస్తాను, సారీ మన పడగ్గది లోకి పోదాం" అన్నది సీత.

అహంకారం నాకు గుడ్‌బై చెప్పినట్లుగా నా మనస్సు ఊరటచెందింది.